కథల పోటీలో మూడో బహుమతి పొందిన కథ



# అనివార్యం

## మాగంటి

మద్రాసు—న్యూఢిల్లీ తమిళనాడు ఎక్స్‌ప్రెస్ పుట్టచెదిరిన కట్లపాములా పట్టాలమీద పరుగులు తీస్తోంటే...

అందులో...ఫస్ట్‌క్లాస్ కూపేలో... కలతనిండిన కళ్ళతో కిటికీలోంచి బయటకు చూస్తూ పడుకున్న నాకు... నా మెదడంతా పగిలిన తేనెతుట్టె మాదిరిగా రొద పెడుతున్నట్టనిపించసాగింది.

అప్పటికి నూరవపర్యాయంగా నా చూపు మరొకసారి చేతి గడియారంమీదికి మళ్ళింది.

బ్లాక్ డయల్‌లోని రేడియం ముళ్ళు తళుక్కున మెరిశాయి.

ఈ రైలు విజయవాడ చేరుకోవడానికి ఎంతలేదన్నా ఇంకా రెండు గంటలు పడుతుందని నాకు అర్ధమైపోయింది.

అయితే నాకు అర్ధం కానిదల్లా.. ఈ రెండుగంటల కాలంలో నా గుండె ఆగిపోకుండా వుంటుందా అన్నది మాత్రమే!

నా ప్రమేయం లేకుండానే ఒక వేడి నిట్టూర్పు నా హృదయకోశం మీదుగా బయటికొచ్చింది.

సరిగా రెండు గంటల తర్వాత విజయవాడలో రైలు దిగితే...

మళ్ళీ అక్కడినుంచి గంట ప్రయాణం.

ఏ ఆటో డ్రైవర్‌నో బతిమలాడుకుని... తెల్లవారుజామున... కటిక చీకటిలో ఆ పల్లెటూరుకు వెళ్ళాలి.

అయినా అది నేను పుట్టి పెరిగిన ప్రాంతమే కనుక అర్ధరాత్రి అయినా, అమావాస్య అయినా భయపడాల్సిందేమీ లేదు.

ఇది తెలిసికూడా నేనిప్పుడు




బితుకుబితుకుమంటున్నానంటే దానికి కారణం ఈ చిమ్మచీకటి ప్రయాణం కాదు.

ఈ ప్రయాణం తర్వాత నేను చేరుకోబోయే ఊరు.

అక్కడ నేను చూడబోయే దృశ్యం.

అక్కడికి వెళ్ళిన తర్వాత నేను వినబోయే మాట!... అవును అక్కడికి వెళ్ళాక ఆ సందర్భం అసలెలా వుంటుందో?

నా 'నానీ'ని ఎటువంటి పరిస్థితిలో చూడాల్సొస్తుందో?

అసలు చూడగలనో, లేదో?

మద్రాసులో రైలెక్కిన దగ్గర్నుంచి అసలే దడదడగా కొట్టుకుంటున్న నా గుండె ఈ ఆలోచన రావడంతోటే ఇప్పుడు ఒక్కసారిగా గుభిల్లుమంది.

ఇవాళ సాయంత్రం సుధానిధినుంచి వచ్చిన ట్రంకాల్ మొత్తానికి ఏదో జరగరానిదే జరిగిపోయినట్లు సూచించింది. ఎంత ఉపద్రవం జరగకపోతే తనని వున్నఫళాన బయల్దేరి రమ్మంటాడు సుధానిధి!

విషయం ఏమిటంటే... "నువ్వు ముందు బయల్దేరి

నా'' అనేశాడు.

''నానీ ఎలా వున్నాడు'' అని అడిగితే... ''అన్నీ వచ్చాక మాట్లాడుకుందాం'' అని బదులిచ్చాడు!

నాకు సుధానిధి గురించి బాగా తెలుసు. ఎంతో విపత్కర పరిస్థితి ఏర్పడితేగాని వాడంత ఖంగారు పడడు. చిన్నప్పుడు మేమిద్దరం కలిసి చదువుకున్న రోజుల్నుంచీకూడా వాడి తరహాయే అంత. మిన్నువిరిగి మీద పడితేనేగాని చలించడు.

సుధానిధిలోని ఈ గొప్ప లక్షణంవల్లనే అసలు ఎవ్వరితోనూ అంతగా స్నేహం చేయని నేను... వాడితో జన్మజన్మలకు తరగనంతటి అనుబంధాన్ని పెంచేసుకున్నాను. వాడికి, నాకు ఎలాంటి బంధుత్వం లేకపోయినా ఇప్పుడు వాడి కుటుంబానికి, నా కుటుంబానికి మధ్య చుట్టరికాల్ని మించిన సంబంధాలు కొనసాగుతున్నాయి.

అంత దగ్గర సంబంధం వుండబట్టే సెలవురోజులు గడపడానికి నా పదిహేనేళ్ళ కొడుకు 'నానీ'ని వారంరోజుల క్రితం సుధానిధి దగ్గరకు పంపించాను.

కాలగమనంలో నేను మద్రాసులో స్థిరపడిపోయి ఆధునిక జీవనానికి అలవాటుపడిపోయినా సుధానిధి మాత్రం కాలంతో రాజీ పడకుండా... వున్న వూళ్ళోనే పొలాలు చూసుకుంటూ పచ్చగా బ్రతికేస్తున్నాడు. సుధానిధిలాంటివాళ్ళను చూసినప్పుడు పల్లెటూళ్ళను వదిలిపెట్టి పట్నాలకు వలసపోవడం ఎంత తెలివితక్కువ పనో అర్థమవుతుంది!

నగర వాతావరణంలో వేగాన్ని, కృత్రిమత్వాన్ని మాత్రమే చూడగలుగుతున్న 'నానీ'ని... ఆ గ్రామీణ జీవితంలోని నిశ్చల సహజ సౌందర్యాన్ని, నిర్మలత్వాన్ని, ఆత్మీయతల్ని చూసేందుకు ఈసరికే నేనెప్పుడో పంపించి వుండాల్సింది.

అయితే సుధానిధి దంపతులు 'నానీ'ని పంపించమని చాలాకాలంగా ఒత్తిడి చేస్తున్నప్పటికీ నేనే వాయిదా వేస్తూ వచ్చాను.

నేను నా 'నానీ'ని చూడకుండా ఒక్కరోజుకూడా వుండలేనిమాట యదార్థం. సుధానిధి దగ్గరకు 'నానీ''ని పంపిస్తే... కనీసం నెలరోజులవరకైనా వాడు నా కొడుకుని మళ్ళీ నా దగ్గరకు పంపించడన్నదికూడా పచ్చినిజం.

అయితే ఇంతకాలంగా నేను 'నానీ'ని ఒక్కసారికూడా ఆ పల్లెటూరుకు పంపకుండా వుండడానికి అసలు కారణం ఇది కాదన్నది నాకు మాత్రమే తెలుసు.

నా 'నానీ' అందరు పిల్లలలాంటివాడుకాదు. వాడొక అభినవ సిద్ధార్థుడు. వాడి మనసు కుసుమకోమలమైనది. ఈ వయసులోనే వాడికి ఈ ప్రపంచం మీద, ప్రపంచంలోని మనుషులమీద, వాళ్ళ సమస్యల మీద అంతులేని జాలి.

పసిపిల్లల హృదయాలన్నీకూడా అలాగే... దయార్ద్రంగా వుంటాయి. అయితే నా 'నానీ'లో ఈ లక్షణం మిగతా పసిపిల్లలలోకంటే బాగా ఎక్కువ!

వాడిని పెద్ద డాక్టర్ని చెయ్యడం నా జీవిత లక్ష్యం! అయితే అంతకంటే ముందు.. ఈ జాలిగుండెల రాకుమారుడు ఏ సర్వసంగ పరిత్యాగిగానో మారకుండా జాగ్రత్తగా చూసుకోవడం నాకిప్పుడు ప్రథమ కర్తవ్యమైపోయింది.

అందుకే... 'నానీ'ని పంపించమని సుధానిధి ఎంతకాలంగానో ఫోన్లమీద పోరుతున్నా ఏదో సాకు చూపి వాయిదా వేస్తూ వచ్చాను.

పూర్తిగా కొత్తదైన ఆ వూరి వాతావరణంలో నాని ఇమడగలడో లేదోనన్నదే ఇంతకాలంగా నన్ను వెన్నంటి వస్తూన్న భయం!

అయితే ఈసారి సుధానిధి ఫోనుమీద కాకుండా... పోయినవారం ఏకంగా మద్రాసులోనే స్వయంగా ప్రత్యక్షమై 'నానీ'ని వెంటబెట్టుకు వెళ్ళిపోతుంటే... ఇక వాడిని కాదనడానికి నాకు మనసొప్పలేదు.

నలుగురు పిల్లలుండి కూడా సుధానిధి నా కొడుకుపట్ల అంత వాత్సల్యం చూపుతుంటే దానిని నేనెలా కాదనగలను. కృత్రిమత్వం నిండిపోయిన మనుషులమధ్య ఇంతటి అభిమానం, ఆత్మీయతల్ని చూపే మిత్రుడు దొరకడమే గొప్ప అదృష్టం.

నా భయాల్ని నాతోనే మిగుల్చుకుని 'నానీ'ని సుధానిధి వెంట పంపేశాను.

అలా పంపి వారం రోజులైందో లేదో... మళ్ళీ సుధానిధి దగ్గర్నుంచి ఈ ఫోన్‌కాల్!

అసలేమైందో స్పష్టంగా చెప్పలేదు.

నా శ్రీమతికి కూడా ఏమీ చెప్పకుండా... 'వేరే పనిమీద బయల్దేరి వెళ్తున్నట్లు' చెప్పి రమ్మన్నాడు.

ఎంతో అత్యవసరమైతేనేగానీ సుధానిధి అలా చెప్పడు.

ఖచ్చితంగా నా 'నానీ'కి ఏదో జరిగి వుంటుంది. లేకుంటే సుధానిధిలాంటి నిబ్బరంగల మనిషి నన్ను అంత ఖంగారుగా పిలవడు.

ఈ ఊహతో నా గుండె ఇప్పుడు మళ్ళీ ఇంకోసారి గతుక్కుమంది.

రైలుకూడా ఇప్పుడు ఏదో వంతెనమీదికి ఎక్కినట్టుగా ఒక్కసారి చిన్న జర్క్ ఇచ్చింది. రైలు చక్రాలు నా మనసును కనిపెట్టినట్టుగా రణగొణశబ్దాలతో వంతపాడడం మొదలుపెట్టాయి. బెర్తుమీద కొద్దిగా పైకిలేచి వాటర్‌బాటిల్‌లోని చల్లని నీళ్ళు రెండు గుక్కలు తాగాను.

అయినా గుండెమాత్రం కుదుట పడినట్టనిపించలేదు.

అసలు 'నానీ'కి ఏమై వుంటుంది? వెళ్ళగానే వాడిని నేను ఎలాంటి స్థితిలో చూడవలసి వస్తుంది?

వాడు మునుపటి 'నానీ'లా నాకు కనిపిస్తాడా, లేక...?

మరొక వేడి నిట్టూర్పు నా గుండెల్లోంచి పెల్లుబికింది.

ఇవి అనవసరమైన ఆలోచనలని నాకు తెలుసు. విజయవాడ వెళ్ళేవరకు నేను ప్రశాంతంగా వుండడం మినహా చేయగలిగింది మరేమీ లేదనికూడా తెలుసు. అయినా... అయినా...

అసలీ భయానికంతటికీ మూలం... అప్పుడప్పుడు నా శ్రీమతి అనేట్టుగా... నా పెంపకమేనేమో!

నా పెంపకంలోని లోపంవల్లనే 'నానీ' అంత సున్నితంగా మారాడేమో! వాడంత సున్నితంగా తయారవ్వడం వల్లనే ఇప్పుడు నేను వాడిని గురించి ఇంతగా మథనపడవలసి వస్తున్నదేమో!

రైలువంతెనను దాటిపోయిందని తెలియజేస్తూ ఇప్పుడు మళ్ళీ రైలుచక్రాల కిందశబ్దం మామూలు స్థాయికి వచ్చేసింది.

అయినా 'నా అంతరంగంలో మాత్రం రణగొణ ధ్వనులు అలాగే మిగిలిపోయాయి.

నేను బాల్యం అనేది ఎలా వుంటుందో తెలియకముందే పెద్దవాణ్ణయిపోయాను. ఊహ తెలిసేటప్పటికే నా జీవితం పెద్ద యుద్ధరంగంలా వుంది. ఆ పోరాటంలో గడిచి గట్టెక్కి ఇప్పటికి ఇంతవాణ్ణి కాగలిగాను.



## రక్షణ


బావిలోంచి తనని రక్షించిన వెంకన్నతో అంది కాంతమ్మ.

''నీకెంతో రుణపడి ఉన్నాను వెంకన్నా...''

''అయితేమానె కానీ—

ఈ విషయం అయ్యగారితో మాత్రం చెప్పకండమ్మా పిల్లలుగలోన్ని—'' ప్రాధేయ పడ్డాడు.

—శ్రీనివాస్ పి. (వరంగల్)





**ఏమైందీ?**

పిచ్చయ్య కథ చెప్తున్నాడు.
"రెండు పాములు ఒకదాని తోక మరొకటి మింగసాగాయి..."
"మరి అప్పుడేమైందీ?"
"అక్కడేం మిగల్లేదు. ఒకదాన్నొకటి మింగేశాయి—"
—శ్రీనివాస్ పి. (వరంగల్)

అందుకేనేమో... నాకొడుకు బాల్యం నా బాల్యంలా వృథా కాకూడదన్న అభిప్రాయం నాలో అతి బలంగా... ఒక 'ఫిక్సేషన్'లా నాటుకుపోయింది.

నేను ఇప్పుడు అంతో ఇంతో డబ్బు సంపాదించిన మాట నిజమే. అయినా మారుతున్న కాలంలో ఇప్పుడు డబ్బున్నవాడికి కూడా జీవితం వడ్డించిన విస్తరి కాదు. నా 'నాని'ని నేను జీవితంలో అన్ని ఆటుపోట్లకి సిద్ధంగా పెంచకపోతే వాడు పెరిగి పెద్దయ్యాక ఒంటరిగా బతుకు ప్రయాణం చేయలేడనేది నాకు తెలియక పోలేదు.

అయితే నా ధీమా ఏమిటంటే... 'నాని' మనసు అతి సున్నితమైనదే అయినా వాడు ప్రపంచం తెలియనివాడుమాత్రం కాదు. వాడి వయసు పిల్లలకంటే వాడికిప్పుడు చాలా ఎక్కువ విషయాలే తెలుసు. నేను వాడితో ఒక తండ్రిలా కాక ఒక స్నేహితుడిగా మెలగడంవల్లనే ఇది సాధ్యమైందని నేను సగర్వంగా చెప్పగలను.

'నాని'కి ఇప్పుడు తన చుట్టూ వున్న ప్రపంచంలో తెలియని విషయాలంటూ పెద్దగా ఏమీ లేవు. ఆఖరికిప్పుడు స్త్రీ పురుష సంబంధాలను గురించికూడా కొంత అవగాహనవున్నదంటే వినేవాళ్ళకి ఆశ్చర్యంగా వుండవచ్చు. స్త్రీ పురుషులు శారీరకంగా కలవడంవల్లనే పిల్లలు పుడతారనేది వాడికి స్పష్టంగా తెలుసు.

ఇటువంటి విషయాల్లో వాడి ఈడు పిల్లలలో వుండే అస్పష్టత, సంకోచం నా 'నాని'లో అణుమాత్రం కూడా కనిపించకపోవడమే అసలు విశేషం.

ఎటువంటి సందేహాన్నయినా సరే నా దగ్గర నివృత్తి చేసుకునే చొరవను వాడికి నేనివ్వడంవల్లనే వాడు ఇంత నిస్సంకోచంగా మారాడని నేను ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

అసలు వాడి దృష్టిలో వాడు నా దగ్గర మాట్లాడకూడని విషయమంటూ ఏదీ లేదు. అలాగే... నేనూ వాడికి తెలియకుండా దాచిన సంగతేదీ నా దగ్గర లేదని కూడా వాడు గట్టిగా నమ్ముతాడు.

మా తండ్రీకొడుకులమధ్య ఏర్పడిన ఈ అరుదైన అనుబంధం నాకు మహత్తరంగా తోస్తే... నా శ్రీమతికి మాత్రం ఇది మహాఘోరంగా కన్పిస్తుంది. పిల్లవాణ్ణి హద్దుల్లో పెట్టకుండా అడ్డమైన ప్రశ్నలూ వేసే చొరవను అనవసరంగా ఇస్తున్నానని నన్ను ఆడిపోసుకుంటుంది.

అయినా ఇందులో ఆమెను అనవలసిందికూడా ఏమీ లేదని నా అభిప్రాయం.

"నాన్నా అసలు నేనెలాపుట్టాను..." అని తన కొడుకు తన భర్తని తన ఎదురుగానే అడిగేస్తుంటే, దానికి తన భర్తకూడా సిగ్గు విడిచి సవివరంగా సమాధానం చెప్పేస్తుంటే... సంప్రదాయక కుటుంబంనుంచి వచ్చిన ఏ ఇల్లాలుమాత్రం 'శివశివా' అని చెవులు మూసుకోకుండా వుండగలుగుతుంది.

ఏమైనప్పటికీ నేను అతి చొరవ ఇచ్చి 'నాని'ని చెడగొట్టేస్తున్నాననేది నా శ్రీమతి మనసులోని ఉద్దేశం. అయితే వాడిని నేను నిజంగానే చెడగొడుతున్నానా లేక చెడిపోకుండా కాపాడుతున్నానా అనేది కాలమే నిర్ణయిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం.

అయినా... వాడు చెడిపోయేదీ లేక బాగుపడేదీ తేలడానికి ఇంకా చాలా సంవత్సరాల వ్యవధి వుంది. దానికంటే ముందుగా... అసలు వాడికేమైంది?... సుధానిధి నన్నెందుకు ఇంత హఠాత్తుగా పిలిపిస్తున్నాడు? ఇవి తెలుసుకోవడం నాకిప్పుడు చాలా ముఖ్యం.

బండిదిగి, ఆటో మాట్లాడుకుని, తెల్లవారు జామున... ఆ చీకట్లో సుధానిధి ఇంటికెళ్ళి తలుపు తట్టేవరకు కూడా నా మనసులో ఈ ప్రశ్నలు కట్లపాముల్లా కదులుతూనే వున్నాయి.

తలుపు తెరిచి ఎదురొస్తూనే సుధానిధి నన్ను చూసి బావురుమన్నాడు. వాడి శ్రీమతికూడా చెంగు అడ్డుపెట్టుకుని వెక్కిళ్ళు పడుతోంది.

వాళ్ళని ఆ పరిస్థితిలో చూడగానే నా చేతిలోని సూట్‌కేస్ నాకు తెలియకుండానే జారి క్రిందపడిపోయింది.

ఆందోళనగా చుట్టూ పరికించి చూశాను.

నా'నాని' ఎక్కడా కనిపించలేదు.

నా భయం ఇప్పుడు రెట్టింపయిపోయింది.

ఖచ్చితంగా వాడికి ఏదో జరగరానిదే జరిగిపోయిందనిపించింది.

సుధానిధి ముఖంలోకి నిస్సహాయంగా చూడడం మినహా మరేం చేయలేకపోయాను.

సుధానిధి నన్ను మెల్లిగా ఇంట్లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టి అసలు విషయం చెప్పాడు. అది వినగానే నాగుండె ఇక ఆగిపోవడమే తరువాయి అనిపించింది.

ఈరోజు మధ్యాహ్నంనుంచి 'నాని' కనిపించడం లేదట! ఎవ్వరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడట.

నా నానీ... నా ప్రాణంలో ప్రాణంలాంటి నా నానీ... నా కంటిపాపలాంటి నా నానీ... కనిపించకుండా పోవడమా!

ఎలా ఈ వార్తని నమ్మడం? ఎలా ఈ వార్తతో మళ్ళీ నా శ్రీమతి ముఖాన్ని చూడడం? అసలెలా ఈ శోకాన్ని భరించడం?

అయినా అసలెందుకిలా జరిగింది? ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయే విపరీత మనస్తత్వం కాదే నా 'నాని'ది!

ఒకవేళ వాడిని ఇక్కడ ఎవరైనా ఏమైనా అన్నారేమో!...

ఏమో అలా జరిగి వుంటుందని ఏమాత్రం అనిపించడంలేదు. అసలు 'నాని'కి ఇక్కడ పరాయివాళ్ళు మాత్రం ఎవరున్నారు? సుధానిధి కుటుంబ సభ్యులందరికీ వాడు గారాలపట్టి లాంటివాడయ్యె!


మరయితే అసలేమైవుంటుంది?

అదే తనకీ అంతుబట్టడంలేదని సుధానిధి వాపోతుంటే వాడితోపాటు నేనూ కళ్ళనీళ్ళు పెట్టుకోవడం మినహా అప్పటికి మరేం చేయలేకపోయాను.

తెల్లవారేవరకు ఒకరి శోకాన్ని మరొకరం పంచుకుని తెల్లవారగానే నేనూ, సుధానిధి ఆ పల్లెటూరునుంచి విజయవాడ వెళ్ళి నగర పోలీసు కమిషనర్ని కలుసుకుని 'నాని' జాడ తెలియకుండా పోయిన విషయాన్ని వివరించాం.

మా సుధానిధి నా దగ్గర అంత సాదాసీదాగా వున్నా వాడికి ఆ ప్రాంతంలో మంచి పలుకుబడి వుంది. పైగా కమిషనర్‌గారుకూడా సహృదయుడైన యువకుడు. ఆఘమేఘాలమీద అన్ని ప్రాంతాలకీ నా 'నాని' వివరాలు వైర్‌లెస్‌మీద వెళ్ళిపోయాయి. నా 'నాని' తప్పకుండా త్వరలోనే కనిపిస్తాడని కమిషనర్‌గారు ధైర్యం చెప్పి పంపించారు.

ఇక అక్కడ వుండి నేను చేయగలిగిందేమీ లేదనిపించి... పోలీసుల్ని ఆరా తీసే బాధ్యత సుధానిధికి అప్పగించేసి... ఈ విషయాన్ని ఎలాగైనా సరే నా శ్రీమతికి వెంటనే చెప్పవలసిన బాధ్యత నా మీదనే



వున్నది కనుక... ఆ మధ్యాహ్నం ఫ్లయిట్‌కే మళ్ళీ విజయవాడనుంచి బయల్దేరి సాయంత్రం అవుతుండగానే మద్రాసు చేరిపోయాను.

అయితే... మద్రాసులో... ఇంట్లో అడుగు పెడుతూనే ఎదురుగా కనిపించిన దృశ్యానికి నేను అంతులేని ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను.

ఆనందంతో నాకు గొంతుకూడా పూడుకుపోయింది.

ఎదురుగా వరండాలో... ఈజీచైర్‌లో...

రిలాక్సవుతున్న 'నానీ'... నా 'నానీ'!

అంటే... అంటే... 'నానీ' సుధానిధి ఇంట్లోంచి ఎక్కడికో వెళ్ళిపోలేదన్నమాట! పరాసరి ఇక్కడికే వచ్చేశాడన్నమాట!

అయితే... అయితే వీడు అలా అక్కడ ఎవ్వరికీ చెప్పకుండా ఎందుకు వచ్చేసినట్టు?

దగ్గరకు వెళ్ళి 'నానీ' భుజంమీద చెయ్యివేశాను.

వాడు నెమ్మదిగా తలతిప్పి పేలవంగా నా కళ్ళలోకి చూశాడు.

ఆ చూపు నాగుండెల్లో కలుక్కున గుచ్చుకుంది.

వాడు దేనికో తీవ్రంగా బాధపడుతున్నాడని నాకు అర్థమైపోయింది.

నెమ్మదిగా తలతిప్పి పరిసరాల్ని పరికించాను.

నా శ్రీమతి వంటగదిలో వున్నట్టుంది: నేను వచ్చినసంగతికూడా ఆమె ఇంకా గమనించలేదు.

అదే మంచి అదననిపించి 'నానీ'ని భుజంమీద చెయ్యివేసి గార్డెన్‌లోకి నడిపించుకెళ్ళి కూర్చోబెట్టి విషయమేమిటని అడిగాను.

అందుకు బదులుగా వాడు సూటిగా అడిగిన ప్రశ్న నా హృదయానికి శరాఘాతంలా తగిలింది.

"డాడీ మన క్యాస్ట్ ఏమిటి?"

కులం!... నా 'నానీ' ఇప్పుడు తన కులం గురించి అడుగుతున్నాడు.

ఈ పది, పదిహేనేళ్ళలో వాడితో నేను ఆప్తమిత్రుడిలా సంచరించి అన్ని విషయాలు వాడితో చర్చించాను. ఆఖరికి స్త్రీ, పురుష సంబంధాలను గురించికూడా వాడికి నేను వివరించాను.

కాని... కాని... ఒకే ఒక్క విషయం... ఈ 'కులం' గురించి మాత్రం కావాలనే వాడి దగ్గర నేనింతవరకు ఏమీ మాట్లాడలేదు.

అయినా వాడు ఆ ఒకే ఒక్క విషయం గురించి ఇప్పుడు నన్ను అడగనే అడిగేశాడు!

కులం అనేది ఎంత వ్యాకులం కలిగిస్తుందో అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వాడిని; కుల విభేదాలతో సమాజం ఎంతగా చీలిపోతున్నదో కళ్ళారా చూసిన వాడిని; 'కులపిచ్చి' తలకెక్కినవాళ్ళ కుట్రలకి ఒక యౌవన కాలాన్ని బలిపెట్టిన వాణ్ణి! అందుకే... అందుకే కనీసం నా కొడుకైనా కుల ప్రస్తావన లేని వాతావరణంలో పెరగాలనుకున్నాను. కులాల క్రీనీడలు పడని పరిసరాలలో వాడు కేవలం ఒక మనిషిగా మాత్రమే ఎదగాలనుకున్నాను.

నేను స్థిరపడిన మద్రాసు వాతావరణం కూడా నా ఉద్దేశానికి చాలావరకు అనుకూలంగానే ఉన్నట్టు అనిపించింది. ఇక్కడ ఆధునిక నాగరికతా వేగంలో, వివిధ జాతుల సంగమమైన కాస్మోపాలిటన్ కల్చర్‌లో కులాల గురించి మాట్లాడుకునే తీరిక అంతగా ఎవరికీ లేదు.

నేను, నా శ్రీమతి కూడా ఇంతవరకు ఏనాడూ నా 'నానీ' దగ్గర కులాల ప్రస్తావనే తేలేదు. ఈ సమాజంలో మనిషి తనను తాను 'కులం' అనే కత్తితో చీల్చుకుంటున్నాడని మేము వాడికి ఎన్నడూ చెప్పలేదు. ఆఖరికి వాడి కులం ఏమిటనేది సైతం వాడికి చెప్పవలసిన అవసరం మాకింతవరకు ఏర్పడనే లేదు!

ఈనాటి పరిస్థితులలో ఒక తల్లి, తండ్రి... తమ బిడ్డకి వాళ్ళ కులం గురించి చెప్పకుండా పెంచుతున్నారంటే వినే వాళ్ళకి విడ్డూరంగా ఉండవచ్చు! అయినప్పటికీ ఇది పచ్చి నిజం; నాకు, నా శ్రీమతికి మాత్రమే తెలిసిన అసలు సిసలు నిజం.

అయితే నాకు తెలియనిదల్లా... నా కొడుకే ఒక నాటికి ఇలా తన కులాన్ని గురించి నన్ను నిలవేసి అడిగే పరిస్థితి ఎదురవుతుందన్నదీ!

ఈ పరిణామం ఈనాటి సమాజంలో అనివార్యమన్నది!

ఈ 'ఇ నెవిటబుల్'ని గురించి మాత్రమే నేనింత వరకు ఊహించలేకపోయాను.

అయినా... ఇప్పుడు నా 'నానీ' ఇంత హఠాత్తుగా ఇలా ఎందుకు అడుగుతున్నట్టు? వీడు సుధానిధి ఇంట్లోంచి చెప్పకుండా వెళ్ళిపోవడానికి, ఈ ప్రశ్నకు ఏమిటి సంబంధం?

"మాట్లాడవేం డాడీ; అసలు మన క్యాస్ట్ ఏమిటి? మనకి ఒక క్యాస్ట్ అంటూ ఉంటుందని నువ్వింతవరకు నాకెందుకు చెప్పలేదు? సుధానిధి అంకుల్ వాళ్ళ పిల్లలు నీ క్యాస్ట్ ఏమిటి అని అడిగినపుడు నేను తెల్లముఖం వేస్తే వాళ్ళు నన్ను చూసి ఎలా నవ్వారో తెలుసా? నేను అప్‌సెట్ అయిపోయి ఇలా ఎవ్వరికీ చెప్పకుండా మద్రాసు వచ్చేశాను..."

—'నానీ' మాట్లాడుతుంటే నా తల గిర్రున తిరగ సాగింది.

ఆ పరిస్థితిలో నా 'నానీ' ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కొని ఉంటాడో నేను తేలికగానే ఊహించ గలిగాను.

కాని... కాని నా ఊహకందనిదల్లా... అంత నిర్మలమైన పల్లెటూరులో, అంతకంటే నిర్మలమైన సుధానిధి దంపతులకు పుట్టిన పిల్లలు... అంత చిన్న వయస్సులోనే సాటి పిల్లవాడిని కులం గురించి ప్రశ్నించే పరిస్థితి ఎలా ఏర్పడిందన్నది!

ఒకప్పుడు... నా చిన్నతనంలో... అంతా ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డల్లా మెలిగిన ఆ ఊరి జనంలో... ఇప్పుడు కులం అనేది 'పసితనం' నుంచీ కూడా నరనరాల్లోకి పాకిపోతున్నదా?

పసిడి గుండెల పల్లెటూళ్ళలో ఇప్పుడు పాలబుగ్గల పసికూనల పెదవుల మధ్యన కూడా 'కులం' కూనిరాగాలు తీస్తోందంటే... దానికి బాధ్యత వహించే కారణాలు సాంఘికమా, ఆర్థికమా లేక రాజకీయమా?

ఏమైనప్పటికీ... 'కులం' అనే కాలకూట విషాన్ని పాలసీసాల్లో నింపి పసివాళ్ళకు సైతం తాగిస్తున్న నేటి తెలుగు పల్లెటూళ్ళకు ఇకమీదట నా 'నానీ'ని... కనీసం ఒక్కరోజు అక్కడ గడిపేందుకైనా సరే పంపించనుగాక పంపించను!

ఇదే నా నిర్ణయం!

—నానీని భుజం మీద చెయ్యివేసి మళ్ళీ ఇంట్లోకి నడిపించుకెళుతుంటే... వాడికళ్ళలో పశేషంగా మిగిలిపోయిన ఎన్నో ప్రశ్నలు!

అయితే ఈసారి వాటికి నేను సరైన సమాధానాలు ఇవ్వలేనని నాకు బాగా తెలుసు!

అందుకే... వాడి కళ్ళలో కదలాడుతున్న ఆ ప్రశ్నలకు జవాబిచ్చే బాధ్యతను రానున్న కాలానికి, ఆకాలంలో వాడుగడించబోయే అనుభవాలకి వదిలేస్తున్నాను! *



## పోదాం

రమేష్ సీరియస్‌గా అడిగాడు నాగేశ్వరిని.

"మన పెళ్ళికి పెద్దలు ఒప్పుకోక పోతే ఎదిరిద్దామా? లేచిపోదామా?"

" ఏం వొద్దు. విడిపోదాం" సింపుల్‌గా చెప్పింది.

—చుక్కల గోపిచందర్
(మహబూబాబాద్)

